అధికారి కారుకు సర్కారు అద్దె

- ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు
- అక్రమంగా బిల్లులు నొక్కేస్తున్న వైనం
- నిరుద్యోగుల ఉపాధికి గండి



ఎల్లారెడ్డి : పాలనా యంత్రాంగంలో కీలకపాత్ర పోషించే అధికారులు తమ అధికారిక పర్యటనల నిమిత్తం అద్దెకార్లను వినియోగించుకునే వెసులుబాటు ఉంది. ట్యాక్సీ ప్లేట్ ఉన్న కార్లను మాత్రమే వినియోగించాలని ఖచ్చితమైన నిబంధన ఉన్నా వాటిని బేఖాతరు చేస్తూ తమ సొంత కార్లలోనే తిరుగుతూ అద్దె బిల్లులు కాజేస్తున్నారు. తహసీల్దార్ స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు పలు శాఖల అధికారులందరికీ తామ విధుల్లో భాగంగా అద్దె కార్లు తీసుకునే సదుపాయం ప్రభుత్వం కల్పించింది. ఇందుకు గాను ప్రతీ వాహనానికి రూ. 33 వేలు ప్ర భుత్వం చెల్లిస్తుంది. అధికారులు సొంత వాహనాన్ని బినామీ పేర్లతో అద్దెకు పెట్టి ప్రతీ నెలా రూ. 33 వేలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం 90శాతం మంది అధికారులు తమ సొంతకార్లలోనే తిరుగులూ దర్జాగా అద్దె కాజేస్తున్నట్లు సమాచారం.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి మండలంలో దివ్యాంగురాలైన ఒక అధికారిణి అద్దె కారు పేరుతో తన సొంత కారునే వాడుతున్నారు. అంగవైకల్యం కారణంగా నడవలేక వీల్‌చైర్‌లో కూర్చుని విధులు నిర్వహించే ఈమె క్లచ్, బ్రేక్, ఎక్సిలేటర్ వాడడానికి కాళ్లకు బదులుగా చేతుల ద్వారా ఉపయోగించుకునేలా తమ కారులో ప్రత్యేక ఏర్పాట్లు చేయించుకున్నట్లు సమాచారం. సొంత వాహనాలను ఉపయోగించుకుంటున్న అధికారులు బిల్లుల కోసం తమకు నమ్మకస్తులైన ట్యాక్స్ ప్లేటెడ్ వాహనాల యజమానులతో ఒప్పందం కుదుర్చుకుని బిల్లుల కోసం వారి వాహనాల నెంబర్లను వాడుకుంటూ వారి పేర్లపైనే బిల్లులు తీసుకుంటున్నారు. ఇందుకు గాను ట్యాక్స్ ప్లేట్ వాహనాల యజమానులకు అధికారులు రూ. 3 వేలు కమీషన్ ఇస్తున్నట్లు తెలిసింది. నెలలో 25000 కి.మీ తిరగకపోయినా తిరిగినట్లు బిల్లులు పెడ్తున్నారు. మున్సిపాలిటీలో ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది.

నిబంధనల ప్రకారం..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం అద్దె కారు సదుపాయం ఉపయోగించుకునే స్థాయి గల అధికారులు ట్యాక్సీ ప్లేట్ కలిగిన కార్లు, జీపులను మాత్రమే అద్దెకు తీసుకోవాలి. థర్డ్ పార్టీ ఏజెన్సీల ద్వారానే ఈ వాహనాలను టెండర్ల ద్వారా అద్దెకు తీసుకుని వారికే అద్దె చెల్లించాలి. అధికారులు నెలకు అద్దెకు తీసుకున్న వాహనంలో 2500 కిలో మీటర్లు మాత్రమే అదికూడా విధుల నిర్వహణకు మాత్రమే తిరగాలి. తాము ఎక్కడ తిరిగిందీ లాగ్‌బుక్‌లో నమోదు చేయాలి. అద్దెకు తీసుకున్న కారుకు డ్రైవర్‌ను థర్డ్‌పార్టీ ఏజెన్సీ ఏర్పాటు చేయాలి. అద్దె బిల్లుల చెల్లింపుల సమయంలో లాగ్‌బుక్ పై అధికారుల పరిశీలన నిమిత్తం అందజేయాలి. సొంత పనులకు వాడవద్దు. అయితే జిల్లాలో అధికారులు ఉపయోగిస్తున్న వాహనాల్లో 10 శాతం కూడా ట్యాక్సీ ప్లేటెడ్ వాహనాలు ఉండటం లేదు. ఈ వాహనాలను అధికారులే సొంతంగా డ్రైవ్ చేస్తున్నారు.

ఉన్నతాధికారులదే బాధ్యత

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ట్యాక్సీ ప్లేట్ వాహనాలను మాత్రమే అద్దెకు తీసుకోవాలి. అధికారులు వాడుతున్న వాహనాలు అద్దెవో, సొంతానివో ఆయా శాఖల పైఅధికారులే గుర్తించాలి. అధికారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారమే బిల్లులు పెడుతున్నారు. వాటిని గుర్తించడం కష్టం. దివ్యాంగులైన వారు ఎట్టి పరిస్థితులో ట్యాక్సీ ప్లేట్ వాహనాలు వాడకూడదు.

– శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా రవాణాశాఖ అధికారి

ఆగమవుతున్న చదువులు

నిజాంసాగర్(జుక్కల్): అదనపు గదుల నిర్మాణం అసంపూర్తిగా నిలవడంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల చదువులు ఆగమవుతున్నాయి. విద్యాసంవత్సరం ప్రారంభమై 15 రోజులు కావస్తున్నా అర్ధంతరంగా ఆగిన అదనపు గదుల నిర్మాణ పనులు జాడా కరువైంది. మహమ్మద్‌నగర్ మండలంలోని గాలీపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదోతరగతి వరకు 80 మంది విద్యార్థులు ఉన్నారు. కాని సదరు పాఠశాలలో రెండు గదులు మాత్రం ఉన్నాయి. పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి జిల్లా పరిషత్ ద్వారా రూ. 20 లక్షలు మంజూరయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో నిధులు రావడంతో అదనపు గదుల నిర్మాణ పనులు చేపట్టారు. గదుల నిర్మాణానికి నిధులు సరిపడకపోవడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపేశారు. రెండు గదుల్లో 5 తరగతుల నిర్వహణ కష్టంగా మారడంతో అసంపూర్తిగా ఉన్న గదుల్లోనే చదువులు చెబుతున్నారు. అధికారులు ఇకనైనా స్పందించి అదనపు గదుల నిర్మాణ పనులకు సరిపడా నిధులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



అసంపూర్తి గదుల్లో పాఠాలు చెబుతున్న టీచర్

డెస్క్ బెంచీల వితరణ



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన సినీ నిర్మాత కానూరి శ్రీనివాస్ 15 డెస్క్ బెంచీలను అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం చందర్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు గునిగెరి హన్మాండ్లు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : మండలంలోని సోమర్యాగడి తండాలో రైతులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చిత్ర పటాలకు మంగళవారం పాలాభిషేకం చేశారు. రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీకి సంబంధించి సీఎం ఆమోదించడానికి హర్షిస్తూ పాలాభిషేకం చేశారు.

తైబజార్లకు వేలంపాట





బాన్సువాడ బల్దియాలో తైబజారుకు వేలం నిర్వహిస్తున్న అధికారులు, బీబీపేటలో..

బాన్సువాడ : బాన్సువాడ బల్దియాలో మంగళవారం తైబజారుకు వేలం పాట నిర్వహించారు. మున్సిపల్ జంగం గంగాధర్ అధ్యక్షతనలో తైబజారుకు వేలం పాట నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో మూడు నెలల పాటు వాయిదా వేసిన వేలం పాటను ప్రస్తుతం నిర్వహించారు. గత ఏడాది మేకల సంతను రూ.35.75 లక్షలకు వేలం పాటలో దక్కించుకుని ఈ సారి మరో కాంట్రాక్టర్ రూ.33.10 లక్షలకు పాట పాడి దక్కించుకున్నారు. రోజు వారి సంత గతేడాది రూ.7.35 లక్షలకు పోగా ప్రస్తుతం రూ. 7 లక్షలకు వేలం పాటలో కాంట్రాక్టర్ దక్కించుకున్నారు. వారంతపు సంత గతేడాది రూ. 8.50 లక్షలకు పోగా ప్రస్తుతం రూ. 10.10 లక్షలకు వేలం పాటలో మరో కాంట్రాక్టర్ దక్కించుకున్నారు. పశువుల దాఖలాకు ఎవరు ముందుకు రాకపోవడంతో వేలం వాయిదా పడింది. ఈ తైబజారు 2024-2025 మార్చి వరకు కొనసాగుతుందని కమిషనర్ శ్రీహరి రాజు తెలిపారు. ఈ వేలం పాటతో మున్సిపాలిటీకి రూ. 50 లక్షల ఆదాయం సమకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జుబేర్, బల్దియా అధికారులు మల్లికార్జున్‌రెడ్డి, శ్రీనివాస్, నారాయణ, కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

బీబీపేటలో..

బీబీపేట : మండల కేంద్రంలోని 2024–25కు గాను వారాంతపు సంత తైబజార్ వేలం పాటను మంగళవారం గ్రామ జీపీ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో వేశారు. వారాంతపు సంతను రూ. 1.74 లక్షలకు చాట్ల లింగం దక్కించుకున్నారు. ఈ సమావేశంలో జీపీ కార్యదర్శి రమేష్, కారోబార్ సిద్ధిరాంలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతల పూడ్చివేత



నిజాంసాగర్(జుక్కల్) : జుక్కల్ మండలకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌తో పాటు గుండూర్ మార్గంలో ఉన్న గుంతలను మంగళవారం కంకర, సిమెంట్ కాంక్రీట్‌తో పూడ్చి వేయించారు. రోడ్డు దుస్థితిని స్థానికులు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు స్పందించిన ఎమ్మెల్యే రోడ్డుపై గుంతలను పూడ్చి వేయాలని కాంగ్రెస్ నాయకులను ఆదేశించారు. దాంతో మండల కాంగ్రెస్ నాయకులు అస్పత్ వార్ వినోద్ రోడ్డుపై గుంతలను పూడ్చివేయించడంతో గ్రామస్తులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

పరీక్షప్యాడ్ల అందజేత



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని కిచ్చన్నపేట గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం యూత్ సభ్యులు నోట్ బుక్స్, పరీక్షప్యాడ్లను అందజేశారు. గ్రామానికి చెందిన మంత్రి లక్ష్మణ్ అనే యువకుడు ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందాడు. లక్ష్మణ్ జ్ఞాపకార్థం ఆయన స్నేహితులు గ్రామంలోని పాఠశాలలో విద్యార్థులకు నోటుబుక్కులు, పరీక్షప్యాడ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు స్వర్ణ, శృతి, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో పర్బన్న సూచించారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. మిషన్ భగీరథ నల్లాల సర్వేను వెంటనే పూర్తి చేయాలన్నారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ వేయించాలన్నారు.సమావేశంలో ఎంపీవో ప్రకాశ్ పాల్గొన్నారు.

కామారెడ్డి రూరల్ : గ్రామాల్లో పారిశుధ్య పనులను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీవో మలహరి సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని నర్సన్నపల్లి, క్యాసంపల్లి గ్రామాల్లో పర్యటించారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జీపీ కార్యదర్శులు నవనీత, సౌమ్య, కారోబార్లు, సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో పర్బన్న

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : గ్రామంలో ఎక్కడా కూడా నీటిసమస్య తలెత్తకుండా చూడాలని నాగిరెడ్డిపేట ఎంపీవో ప్రకాశ్ సూచించారు. నాగిరెడ్డిపేట మండలంలోని గోపాల్‌పేట గ్రామపంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను ఆయన పరిశీలించారు. ఆయనవెంట పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య ఉన్నారు.

క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



బీబీపేట : మండల కేంద్రంలోని వాసవి క్లబ్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో మంగళవారం మెగా ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 105 మందికి ఈసీజీ, కంటి పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. జిల్లా చైర్మన్ రాజన్న, వైస్ చైర్మన్ నాగరాజు గౌడ్, మండల చైర్మన్ బాశెట్టి నాగేశ్వర్, వైస్ చైర్మన్ స్వామి, సెక్రెటరీ రఘుకుమార్, కరస్పాండెంట్ పీవీ నరసింహం, జిల్లా హెల్త్ కోఆర్డినేటర్ డా. విక్రమ్ కుమార్, వాసవి క్లబ్ ప్రతినిధులు యాదగిరి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలోని అటానమస్ డిగ్రీ కళాశాలలో ఫస్టియర్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ చంద్రముఖర్జీ తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థుల కోసం బిచ్కుంద డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంపీసీ, బీజెడ్సీ, కంప్యూటర్ కోర్సుల కోసం అడ్మిషన్లు కొనసాగుతున్నాయన్నారు. మూడో విడతలో భాగంగా వచ్చేనెల 2వ తేదీ వరకు దోస్త్ ద్వారా ఆన్‌లైన్‌లో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. 94927 95524లో సంప్రదించాలన్నారు.

పశువైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి



దోమకొండ : దోమకొండ మండల కేంద్రంలో పశువైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని దోమకొండ జెడ్పీటీసీ సభ్యుడు తీగల తిరుమల గౌడ్ అన్నారు. మంగళవారం దోమకొండ పశు వైద్యశాలను రైతుతో కలిసి పరిశీలించారు. మేకలకు, గేదెలకు వైద్యం అందించడం లేదని రైతులు జెడ్పీటీసీకి వివరించారు. ఈ విషయమై జిల్లా అధికారుల దృష్టికి తీసుకుపోగా రెండు మూడు రోజుల్లో వైద్యుడికి అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట ఆలయ కమిటీ అధ్యక్షుడు అబ్రబోయిన రాజు, కొండ అంజం, రైతులు ఉన్నారు.

అధిష్టానం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం



బాన్సువాడ : కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని మాజీ జెట్పీటీసీ నార్ల రత్నకుమార్ అన్నారు. మంగళవారం బాన్సువాడలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారని, ఆయన చేరికను స్వాగతిస్తున్నామన్నారు. పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్ని కార్యకర్తలు కట్టుబడి ఉండాలన్నారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడ్డ వారికి ప్రాధాన్యత కల్పించాలన్నారు. నాయకులు మాసాని రవీందర్‌రెడ్డి, నార్ల సురేష్, అఫ్రోజ్, మాసాని అశోక్‌రెడ్డి, ఉడుత గంగాధర్ ఉన్నారు.

వరంగల్ సభను సక్సెస్ చేయాలి



మాచారెడ్డి : ఎస్సీ వర్గీకరణలో భాగంగా వచ్చే నెల 7న వరంగల్‌లో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ మహా సభను సక్సెస్ చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు బట్టు వెంకట్ రాములు పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మార్పీఎస్ మండల శాఖ కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. మండల శాఖ నూతన అధ్యక్షుడు బట్టు రమేష్, ఉపాధ్యక్షుడు గుండెల్లి పెద్ద కాశీరాం, అధికార ప్రతినిధి బట్టు ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి మామిడి హరీష్, జిల్లా అధ్యక్షురాలు సత్తిగారి లక్ష్మీ, జిల్లా కార్యదర్శి యాదగిరి, నాయకులు పురుషోత్తం తదితరులున్నారు.

బోరుమోటార్ ప్రారంభం



కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలో నీటి ఎద్దడి తీర్చేందుక నూతన బోరు మోటార్‌ను చైర్‌పర్సన్ ఇందుప్రియ మంగళవారం ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ సుజాత, కౌన్సిలర్ అవధూత నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని చిన్నదేమిశి వారులో మైసమ్మ ఆలయంలో మంగళవారం గ్రామ పెద్దలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్కడే రైస్‌మిల్‌ను నిర్మిస్తున్న యజమానులు ఆరుపిల్లర్లతో కూడిన గుడి నిర్మాణం కూడా చేపడుతారని తెలిపారు. వర్షాలు సంవృద్ధిగా కురిసి ఈ ఖరీఫ్‌లో వేసిన పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు.

ఘనంగా గంగమ్మ ఆలయం వార్షికోత్సవం



భిక్కనూరు : మండలకేంద్రంలోని గంగమ్మ ఆలయం వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గంగమ్మతో శివునికి కల్యాణంను నిర్వహించారు. పెద్దఎత్తున అన్నదానం నిర్వహించారు.

అయ్యప్ప ఆలయంలో సంకష్టహర చతుర్థి



పిట్లం(జుక్కల్) : మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సంకష్టహర చతుర్థి వేడుకలను ఘనంగా ని ర్వహించారు. ఆలయంలో ఉదయం గణపతి హో మం నిర్వహించారు. అదేవిధంగా వినాయకుడికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జగదీష్, సభ్యులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని మైలారం గ్రామంలో కొచ్చెరి మైసమ్మ ఆలయంలో మంగళవారం భక్తుల సందడి నెలకొంది. దీనిలో భాగంగా ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు.

కాలభైరవుడికి సిందూర పూజలు

రామారెడ్డి : దక్షణ కాశీ ఇసన్నపల్లి(రామారెడ్డి) శ్రీకాలభైరవుడి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశా రు. ఉదయం నుంచి భక్తులు స్వామి వారికి జలాభిషేకాలు, సింధూర పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభుగుప్తా, ఆలయ అర్చకులు శ్రీనివాసశర్మ, వంశీకృష్ణశర్మ, సురేందర్, నాగరాజ్ పాల్గొన్నారు.

రాజాఖాన్ పేటలో మల్లన్న బోనాలు

మాచారెడ్డి : మండలంలోని రాజాఖాన్ పేటలో మంగళవారం మల్లికార్జునస్వామి కల్యాణమహోత్సవం సందర్భంగా బోనాలను ఊరేగించారు. యాదవ సంఘం సభ్యులు ఇంటికో బోనం చొప్పున అలంకరించి గ్రామంలో ఊరేగించిన అనంతరం స్వామి వారికి సమర్పించారు. యాదవ సంఘం సభ్యులతో పాటు గ్రామస్తులు ఉన్నారు.



వర్షాల కోసం జలాభిషేకం



నిజాంసాగర్(జుక్కల్) : వరుణ దేవుడు కరుణించి వర్షాలు సంవృద్ధిగా కురవాలని కోరుతూ మంగళవారం మహమ్మద్ నగర్ మండలంలోని నర్వ గ్రామ అంజనేయస్వామి, శివుడికి గ్రామస్తులు జలాభిషేకం నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయంలోని శివుడిని నీటితో నింపడంతో పాటు అంజనేయస్వామికి జలాలతో నింపారు. వచ్చే శనివారం అన్నదానం చేస్తామన్నారు.

కార్యవర్గం ఎన్నిక



దత్తాత్రేయ

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మున్నూరుకాపు సంఘం తాడ్వాయి మండల అధ్యక్షుడిగా తాడ్వాయికి చెందిన ముదాం దత్తాత్రేయను ఎన్నుకున్నట్లు ఆ సంఘం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన దత్తాత్రేయ మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి పాటుపడతానన్నారు.

వాహనాల తనిఖీ

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డిలో పోలీసులు మంగళవారం వాహనాల తనిఖీ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నెంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేయడంతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను నిర్వహించినట్లు సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై మహేష్‌లు తెలిపారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు



రాజంపేట : మండలంలోని ఆర్గోండ గ్రామంలోని ఎస్సీ కాలనీలో మంగళవారం హైమాస్ట్ లైట్లను ప్రారంభించినట్లు స్థానిక ఎంపీటీసీ సాగర్ తెలిపారు. గ్రామానికి మంజూరైన ఎంపీటీసీ నిధులతో ఈ హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ బీఆర్‌ఎస్ అధ్యక్షులు చాకలి బాబు, శెట్టిగారి శంకర్ తదితరులున్నారు.

వర్షాలు కురిస్తేనే సాగు చేయాలి



భిక్కనూరు : ఆశించిన స్థాయిలో వర్షాలు కురిసిన తర్వాతే పంటలు సాగు చేయాలని ఖమ్మం జిల్లా పాలెం వ్యవసాయ విశ్వవిద్యాలయం సహాయ పరిశోధక సంచాలకులు మల్లారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమంలో రైతులకు ఆయన పంటల సాగుపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఆశించిన స్థాయిలో వర్షాలు కురియకపోవడంతో ఉష్ణోగ్రతం ఎక్కువగా ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు ఆలోచించి పంటలను సాగు చేయాలన్నారు, ఈ కార్యక్రమంల ఏడీఏ అపర్ణ, ఏవో రాధ, ఏఈవోలు వినోద్‌గౌడ్, ఆనంద్, అఖిల్,పలువురు రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నాగిరెడ్డిపేట జెడ్పీటీసీ సభ్యుడు మనోహార్ రెడ్డి సూచించారు. నాగిరెడ్డిపేట మండలకేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. భోజనం సరిగ్గా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని వార్డెన్ రాములును ఆయన ఆదేశించారు. అనంతరం కస్తూర్బా పాఠశాలలో ప్రార్థన సమయంలో ప్రిన్సిపాల్‌తో పాటు మరో ముగ్గురు ఉపాధ్యాయినులు లేకపోవడంపై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అనురాధను ఆయన ప్రశ్నించారు. ప్రిన్సిపాల్ స్కూల్ పనిమీద కామారెడ్డికి వెళ్లారని, ముగ్గురు ఉపాధ్యాయినులు సెలవులో ఉన్నారని ఆమె చెప్పారు. అక్కడి నుండి మోడల్ స్కూల్ చేరుకొని రికార్డులు పరిశీలించారు. ఆయనవెంట మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలత ఉన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జెడ్పీటీసీ

సంక్షిప్తం

నేడు పాఠశాలల బంద్

లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని ప్రైవేటు స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణ చేయాలని డిమాండు చేస్తూ బుధవారం పాఠశాలల బంద్‌కు పిలుపిచ్చినట్లు ఏబీవీపీ మండల ప్రధాన కార్యదర్శి నవీన్ వెల్లడించారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మండలంలోని అన్ని పాఠశాలలు బంద్ పాటించాలని కోరారు.

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలో నేడు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ఏబీవీపీ నాయకులు మంగళవారం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతుల ఏర్పాట్లు లేకపోవడం, ప్రైవేటు పాఠశాలల్లో విచ్చల విడిగా ఫీజులు వసూలు చేయడాన్ని నిరసిస్తూ పాఠశాలల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు వారు తెలిపారు. విద్యార్థులు బంద్‌కు సహకరించాలని ఏబీవీపీ నాయకులు జాషువా, వంశీలు అన్నారు.

మాచారెడ్డి : ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ బుధవారం విద్యాసంస్థలు బంద్ పాటించాలని ఏబీవీపీ జిల్లా హాస్టల్ల కన్వీనర్ ఖలీల్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మాచారెడ్డిలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల పరిస్థితులు దయనీయంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆనందోత్సాహాల మధ్య గ్రాడ్యుయేషన్ డే

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని మర్కల్ గ్రామ స్టేజీ వద్ద గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో మంగళవారం అల్యుమినీ మీట్, గ్రాడ్యుయేషన్ డే వేడుకలను కల్చరల్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాధిక, పూర్వ ప్రిన్సిపాల్ జనార్ధన్ రావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత లెక్చరర్ వీరయ్య, వైస్ ప్రిన్సిపాల్ రేణుక, అకాడమిక్ కోఆర్డినేటర్ వనజ, కల్చరల్ కో ఆర్డినేటర్ ఉదయిని, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

డీలర్లకు బియ్యం తూకంవేసి ఇవ్వాలి

బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలోని ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో రేషన్ డీలర్లకు బియ్యం తూకం వేసి ఇవ్వాలని, బస్తాలో బియ్యం తక్కువగా వస్తున్నాయని డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీపతి అన్నారు. మంగళవారం బిచ్కుందలో ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు వెళ్లి అధికారితో మాట్లాడి సమస్య వివరించారు. 50 కిలోల బియ్యం బస్తాకు 49 కిలో బియ్యం వస్తున్నాయని, ప్రతి డీలర్‌కి ఒకటి, రెండు కింట్వాలు బియ్యం తక్కువ వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీలర్లు రాంచందర్, నాగేష్, పవన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి టౌన్ : జిల్లాలో నిబంధనలను పాటించని ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని భారతీయ విద్యార్థి మోర్చా జిల్లా ఇంచార్జి పెరుమాండ్ల బుల్లెట్ చక్రవర్తి మంగళవారం ఒక ప్రకటనలో డిమండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలు పాటించకుండా అధిక ఫీజులు బలవంతంగా వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు.

నేడు కేజీబీవీకి ఎమ్మెల్యే రాక

నిజాంసాగర్(జుక్కల్) : మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధి బాలికల విద్యాలయంలో విద్యార్థినీలకు యూనిఫాంలు, నోట్ బుక్కుల పంపిణి కార్యక్రమానికి బుధవారం జుక్కల్ ఎమ్మెల్యే తోట. లక్ష్మీకాంతరావు హాజరువుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎలే.మల్లికార్జున్ తెలిపారు.

కూలిన వంతెనతో అవస్థలు



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండలంలో విఠల్‌వాడి తండా, లింగంపల్లి మధ్యలో నూతన వంతెన నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. విఠల్‌వాడి తండా నుండి లింగంపల్లి, విఠల్ వాడి గ్రామాలకు వెళ్లే దారిలో 2006లో నిర్మించిన వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. గతంలో భారీ వర్షాలకు అది పూర్తిగా కూలింది. రాబోయే రోజుల్లో భారీగా వర్షాలు కురిస్తే ఇబ్బందులు ఏర్పడక తప్పవని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అధికారులు ప్రజాప్రజానిధులు ప్రత్యేక దృష్టి పెట్టి వంతెనను నిర్మింపజేయాలని కోరుతున్నారు.